

పట్టణ నిరాశ్రయుల వసతిగృహ సందర్శన

ప్రజాశక్తి – ఏలూరుఅర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలోని వృద్ధులకు అందిస్తున్న వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని, వృద్ధుల ఆరోగ్యం విషయంలో పరిశుభ్రత ఎంతో ముఖ్యమని సూచించారు. వసతిగృహంలోని వారితో మాట్లాడుతూ నిరాదరణకు గురైన వృద్ధులకు వారి పిల్లల నుండి భరణం ఇప్పిస్తామని, పిల్లల పేరున రాసిన ఆస్తులు ఏమైనా ఉంటే తిరిగి వెనక్కి తీసుకోవచ్చని తెలిపారు. అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఉచిత న్యాయ సలహాలకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వసతి గృహ మేనేజర్ తుమ్మలపల్లి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూతో పౌల్ట్రీ పల్టీ..!

పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
స్తంభించిన ఎగుమతులు
ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఉపాధి సమస్య
అధికారుల ప్రకటనలు సరికాదంటున్న రైతులు



ప్రజాశక్తి – తణుకు రూరల్

బర్డ్‌ఫ్లూ.. పౌల్ట్రీ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసింది. ఇప్పటికే కొన్ని రోజులుగా కోళ్ల మృతి చెందుతుండడంతో పౌల్ట్రీ రైతులు ఆర్థికంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బర్డ్ ఫ్లూ వార్తలు, చికెన్, గుడ్లు వాడకంపై నిషేధం గోరు చుట్టుపై రోకలిపోటులా మారిందని రైతులు లబోదిబోమంటున్నారు. తణుకు పరిసర ప్రాంతాలతోపాటు పశ్చిమగోదావరి, అటు ఏలూరు జిల్లాల్లో చికెన్, గుడ్ల అమ్మకం గణనీయంగా పడిపోయింది. వాస్తవంగా కృష్ణానంద పౌల్ట్రీ ఫారానికి కిలోమీటర్ వరకూ రెడ్‌జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధి వరకూ సర్వేలైన్స్ జోన్‌గా ప్రకటించారు. ఆ పరిధిలో చికెన్ షాపులు మూసివేయడంతోపాటు గ్రామాల్లో ఆయా పంచాయతీలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాయి. తణుకు నియోజకవర్గంలో తణుకు రూరల్, ఇరగవరం, అత్తిలి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో మొత్తం 50 వరకూ పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఫారంలో సామర్థ్యాన్ని బట్టి పది వేల నుంచి లక్ష వరకూ కోళ్లను పౌల్ట్రీ రైతులు పెంచుతున్నారు. పది వేల సామర్థ్యం కలిగిన కోళ్ల ఫారానికి మేత, మందులు, కూలీల జీతాలు అన్నీ కలిపి రోజుకు రూ.35 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రోజుకు 1.32 టన్నుల మేత ఖర్చవుతుందని, ఒక టన్ను ధర రూ.30 వేల నుంచి రూ.32 వేల ధర పలుకుతోంది. మేత కింద మొక్కజొన్న, నూకలు, సోయా కేకులు, డిఒబి, సన్‌ఫ్లవర్, ఎండు చేప కలిపి కోళ్లకు మేతల కింద ఇస్తారు. ఈ మేతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు శాతం జిఎస్‌టి విధిస్తోంది. మేతలే కాకుండా మొదటి రోజు పిల్ల దశ నుంచి 25 వారాల వరకూ క్రమం తప్పకుండా నిర్ణీత కాలవ్యవధిలో వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది. 22వ వారం నుంచి కోడిగుడ్లు పెట్టడం మొదలవుతుంది. అప్పటి వరకూ ఒక్కో కోడిపై రూ.360 ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఒక్క గుడ్డు ఉత్పత్తికి రైతుకు రూ.4.31 మేత, కోడి నిర్వహణకు ఖర్చవుతుంది. రోజురోజుకీ పెరుగుతున్న ఖర్చులతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులు ఇప్పటికే లక్షల్లో కోళ్ల మృత్యువాత పడి తల్లడిల్లుతున్నారు. దీనికి కారణం తాజాగా బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో మూడు నెలలు కోళ్ల ఫారాలు మూసివేయాలని ఆ పరిధిలో అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో చికెన్, గుడ్లు వినియోగించరాదనే ప్రచారం పౌల్ట్రీ రైతుల పరిస్థితిని మరింత దిగజార్చింది. పౌల్ట్రీ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక్కో పౌల్ట్రీ ఫారంలో రెండు నుంచి నాలుగు కుటుంబాల వరకూ వలస కూలీల కుటుంబాలు జీవనం సాగిస్తుంటాయి. ఇక తణుకు పరిసరాల్లో 11 వరకూ ఎగ్ ట్రేడింగ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా పౌల్ట్రీ ఫారాల్లో సేకరించిన గుడ్లను పశ్చిమబెంగాల్, అస్సాం, ఒడిశ్శా, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు ఇక్కడ నుంచే ఎగమతి చేసుకుంటున్నాయి. ఒక్కో లారీలో 1.50 లక్షల గుడ్లు చొప్పున 20 లారీల లోడులు ఇతర రాష్ట్రాలకు ప్రతిరోజూ ఎగుమతి అవుతున్నాయి. ఇలా గుడ్లు సేకరించేందుకు వెళ్లే ఒక్కో లారీపై ఆరుగురు కూలీల చొప్పున పని చేస్తుంటారు. ప్రస్తుతం తలెత్తిన పరిస్థితుల్లో పౌల్ట్రీ పరిశ్రమ ఉత్పత్తి నిలిచిపోయి నష్టాల్లోకి వెళ్తే లక్షలాది మంది కూలీలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.

అధికారుల ప్రకటనపై పౌల్ట్రీ రైతుల అసంతృప్తి

బర్డ్ ఫ్లూ, ఆపై చికెన్, గుడ్లు వాడకంపై అధికారులు చేసిన ప్రకటనపై పౌల్ట్రీ రైతుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఈ బర్డ్ అనేది ఎవిఎన్ ఇన్ఫుఎంజా వైరస్ ప్రభావం పక్షులపై, కోళ్లపై తీవ్రంగా ఉంటుందని, కోళ్ల ఫారాల్లో పనిచేసే వ్యక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. మాంసం వినియోగం తగ్గించి, ఉడకబెట్టిన గుడ్లు వినియోగించడంలో ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. ఈ వైరస్ బారిన పడిన మనుషుల్లో జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయని, ఈ వైరస్ ప్రభావం మరింత ఎక్కువ ఉంటే తీవ్రమైన దగ్గు ఆయాసం వస్తుందంటున్నారు. ఈ వైరస్ ప్రభావం తీవ్రమైతే నిమోనియా వంటి లక్షణాలు కన్పిస్తాయని, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ చేరుతుందని చెబుతున్నారు. లక్షణాల తీవ్రతను బట్టి టానిఫ్లూ–75 ఎంజి ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

అపోహల ప్రచారం సరికాదు..



పెన్మెత్స సుబ్బరాజు, పౌల్ట్రీ రైతు, కావలిపురం, ఇరగవరం మండలం

ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్స్ ప్రకారం బర్డ్ ఫ్లూ ఇక్కడ మనుషులకు వ్యాపిస్తుందని అపోహ పడడం సరికాదు. బర్డ్ ఫ్లూ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి తప్ప కోడిమాంసం, గుడ్లు వినియోగించొద్దని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదు. ఈ వైరస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే చనిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మాంసం, గుడ్లను మనం 150 నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించిన తర్వాత తీసుకుంటాం. కాబట్టి వైరస్ ప్రభావం ఉండదు. మైనస్ డిగ్రీల్లో ఉండే దేశాల్లో ఇది మనుషులకు వ్యాపిస్తుంది. ఎపిలో ఉండే ఉష్ణోగ్రతలు కోడి మనుగడకు అనువైనవి. కోడిలో రోగనిరోధక శక్తి పెరిగేందుకు తగిన మందులు ఇవ్వడం ద్వారా వైరస్ ప్రభావం పెద్దగా ఉండదు.

బర్డ్ ఫ్లూ పట్ల ఆందోళన అక్కర్లేదు



కె.శంకరం, పశు సంవర్ధక శాఖాధికారి

బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనకూ గురికావాల్సిన అవసరం లేదు. కోడి గుడ్లు, కోడి మాంసం వినియోగంపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. పూర్తిగా ఉడికించిన ఆహారం తీసుకోవడం వల్ల వైరస్ ప్రభావం ఉండదు. 50 డిగ్రీలు దాటితే వైరస్ చనిపోతుంది. అటువంటిది 100 నుంచి 150 డిగ్రీల వరకూ ఉడికించి తినడం వల్ల ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఇది ఒక ఫారం నుంచి మరో ఫారానికి వ్యాపించి నష్టాలు పెరగకుండా ఉండడం కోసమే నియంత్రణ చర్యలు చేపట్టాం.

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు

ప్రజాశక్తి – ఏలూరు

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో బుధవారం ఎవరూ తమ నామినేషన్లు ఉపసంహరించుకోలేదు. నామినేషన్ల పరిశీలన అనంతరం 43 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్న సంగతి తెలిసిందే. గురువారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక బరిలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి – పిఒ, ఎపిఒలకు మొదటి విడత శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి – ఏలూరు

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ విధులను బాధ్యతగా స్వీకరించి నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎంఎల్‌సి పోలింగ్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 27న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా ఏలూరు జిల్లాకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వహించే పిఒ, ఎపిఒలకు మొదటి విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. దీనికి జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వి, ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల 27న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పట్టభద్రులైన 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో 62 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 24,704 మంది, మహిళలు 17,571 మంది, ట్రాన్స్‌జెండర్లు ఏడుగురు ఉన్నారని తెలిపారు. పోలింగ్ ముందురోజు ఏలూరులో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని అందజేస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం బ్యాలెట్ బాక్సులు పోలింగ్ సామగ్రితో సహా ఏలూరులో ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌కు అత్యంత జాగ్రత్తగా చేర్చాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి తు.చ. తప్పకుండా పాటించి నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను ముగించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సు ఆపరేటింగ్, బ్యాలెట్ పేపర్లు పరిశీలన, పిఒ డైరీ నిర్వహణ ముఖ్యమైన ఘట్టాలన్నారు. ఈ తరగతుల్లో మాస్టర్ ట్రెయినీస్ శ్రీనివాస్, ఫణి శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ భీమేశ్వర్, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి, పిఒలు, ఎపిఒలు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకం
ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత, కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని తూర్పు ,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత అన్నారు. బుధవారం ఏలూరు కలెక్టరేట్లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన మొదటి విడత శిక్షణలో ఆమె కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. నివేదికలను త్వరగా అందజేయాలని కోరారు. మాక్‌పోల్‌ను పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ చాలా ముఖ్యమన్నారు. పోలింగ్ స్టేషన్లలో తమ పాత్ర ఏమిటో స్పష్టంగా తెలుసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 105 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ భీమేశ్వర్, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యాన ప్రదర్శన, ధర్నా – సిఎం ప్రకటనతో మన్యం బంద్ విరమణ



పోలవరంలో ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘాలు

ప్రజాశక్తి – పోలవరం

ఇటీవల విశాఖలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తూ, ఆదివాసీ సంక్షేమ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో పోలవరంలో బుధవారం ప్రధాన రోడ్ల గుండా ప్రదర్శన, ఏటిగట్టు సెంటర్లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ చట్టాలను ఉద్దేశపూర్వకంగానే పాలకులు అమలు చేయట్లేదన్నారు. సామ్రాజ్యవాదులకు, స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అడవులను, భూమి పొరల్లో దాగివున్న అపారమైన సంపదను అప్పగించడం కోసం పాలకులు అనేక కుట్రలు చేస్తున్నారని, ఆ కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన టిడిపి ప్రభుత్వం అడవులను కొండలను ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అప్పగించడం కోసం తీవ్రంగా ప్రయత్నించడంలో భాగమే స్పీకర్ వ్యాఖ్యలన్నారు. ఆదివాసీ సంక్షేమ చట్టాలను అమలు చేయకుండా గిరిజనేతరులకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నేత కారం భాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 1/70 చట్టాన్ని సవరించబోమని సామాజిక మాధ్యమాల్లో చెప్పడం కాదని, 24 నుండి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడుతూ పోలవరం ఏజెన్సీలో అన్యాక్రాంతమైన తమ భూములను గిరిజనులు గత 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్నా వాటికి సాగు నమోదు, హక్కులు కల్పించకపోవడం దారుణమని అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొరగం భూచంద్రరావు మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం 1/70 చట్టాన్ని సవరించాలన్నప్పుడు పెద్దఎత్తున ఆందోళన సాగిందన్నారు. సంక్షేమ చట్టాల అమలుకు సమిష్టిగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు దాడి రాముడు, తామా బాలరాజు, మడివి చలపతిరావు, గోకూరి పాండవులు, కె.పోసిరత్నం, మిడియం పండుదొర, గంగాదేవి, కలుం చిన్న అబ్బులు, పట్టెం పరమేశు, కొమరం రామారావు, మడకం పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: 1/70 చట్టాన్ని సవరించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనతో ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి 48 గంటల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసింది. దీంతో బుధవారం ఉదయం యథావిధిగా వాణిజ్య దుకాణాలు, విద్యాసంస్థలు తెరుచుకున్నాయి.

స్పీకర్‌పై ఫిర్యాదు

జీలుగుమిల్లి: షెడ్యూల్ ప్రాంత చట్టాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్లో, రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పూనెం వెంకటేశ్వరరావు తెలిపారు. ఏజెన్సీలో టిఎసి ఏర్పాటు చేసి ప్రత్యేక ఉద్యోగుల నియామక చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడకం రమేష్, నారం శంకర్, పండు జగదీష్, పండు ప్రసాద్, తెల్లం ప్రసాద్, తెల్లం రాంబాబు, చిర్రి పవన్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు

ప్రజాశక్తి – కొయ్యలగూడెం

ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజల గొంతుకగా పని చేసేందుకు తనను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిగా గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు కోరారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో పలు సంఘాల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన రాఘవులు మాట్లాడుతూ ఇప్పటికే శాసన మండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న కృషి వివరించారు. తన గెలుపునకు సహకరించాలని మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆకుమర్తి విక్టర్, రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు, సొసైటీ ప్రెసిడెంట్ కాలింగి వీర వెంకట సత్యనారాయణ, బిటిఎ మండల అధ్యక్షుడు హుస్సే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: పేద, బడుగు బలహీన వర్గాల గొంతుకైన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని గిరిజన సంఘం నేత తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాచన్నగూడెం, కామయ్యపాలెం, వంకవారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామయ్య, సిహెచ్.కొండలరావు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పట్టిసీమ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి – పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. బుధవారం ఆయన పట్టిసీమలో ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి రాకపోకలు సాగించేందుకు గోదావరిలో ఏర్పాటు చేస్తున్న కాలిబాట ప్రాంతాన్ని, ఇసుక డ్రెడ్జింగ్ ప్రాంతాన్ని, ఫెర్రీ పాయింట్‌ను, ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు, ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ల ఏర్పాట్లు పరిశీలించారు. భద్రతా ఏర్పాట్ల వివరాలను ఎస్ఐ పవన్‌కుమార్ ఎస్‌పికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో యాత్రికులు దర్శనం చేసుకుని తిరిగి వెళ్లే వరకూ వారికి పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాలసురేష్‌బాబు, ఆలయ ట్రస్టీ కె.వెంకటజగన్నాధరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్‌నాయుడు, సిబ్బంది వెంకట్రాజు పాల్గొన్నారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన ఇంటర్ జనరల్, ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 5,635 మందికి 5,441 మంది హాజరయ్యారు. 194 మంది గైర్హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదైంది. ఉదయం 3,107 మందికి 2,972 మంది హాజరవ్వగా 135 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2,528 మందికి 2,469 మంది హాజరవ్వగా 59 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు యోహాను తెలిపారు.

చనిపోయిన కోళ్లు ఖననం

పశ్చిమ కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి – భీమవరం

చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేస్తున్నామని, ప్రజలు వదంతులు నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తణుకు మండలం వేల్పూరులో కోళ్లు మరణిస్తున్నాయని తెలిసిన వెంటనే జిల్లా పశుసంవర్ధక శాఖ ద్వారా చనిపోయిన కోళ్ల నుంచి సేకరించిన నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించడం జరిగిందని, వారు పరిశీలించి ఎవిఎన్ ఇన్ఫ్లూఎంజా వ్యాధి సోకినట్లు నిర్ధారించారని తెలిపారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేయడానికి పశువైద్యులు, సహాయక సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాలకు కిలో మీటరు మేర ఎలర్ట్ జోన్‌గా ప్రకటించి అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై సోమవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పోలీసు, రెవెన్యూ, అటవీ, పశు సంవర్ధక తదితర శాఖలతో 20 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ తక్షణం వ్యాధి నివారణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామాలకు చుట్టుపక్కల 10 కిలో మీటర్ల మేరకు సర్వైలన్స్ ప్రాంతంగా ప్రకటించి, కోళ్లు, కోళ్ల ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని చెరువులు, కొల్లేరు పరివాహ ప్రాంతంలో వలస పక్షులు వచ్చే ప్రాంతాల్లో ఈ వ్యాధి ప్రబలకుండా రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేసి వ్యాధి పర్యవేక్షణ చేయడం జరుగుతోందని తెలిపారు. ఎలర్ట్ జోన్ ప్రాంతంలో మినహా, మిగిలిన ప్రాంతాల్లో ఉడకబెట్టిన గుడ్లు, మాంసాన్ని నిర్భయంగా వినియోగించుకోవచ్చన్నారు. కోళ్లు, గుడ్లు, కోళ్ల దాణా వ్యాధి సోకిన ప్రదేశానికి, బయటకు రాకుండా నిరోధించడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచామన్నారు. కోళ్ల కార్మికులు, ప్రభావిత ప్రాంతాల నివాసితులను క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసేందుకు జిల్లా వైద్యాధికారికి ఆదేశాలిచ్చామన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఈనెల 13 నాటికి వ్యాధి సోకిన వాటిని తొలగించి ఖననం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

చేపల ధరకు రెక్కలు..!

ప్రజాశక్తి – పాలకొల్లు

చికెన్ అమ్మకాలపై గోదావరి జిల్లాల యంత్రాంగం నిషేధం విధించడంతో చేపలు, మటన్, రొయ్యల ధరలకు రెక్కలొచ్చాయి. చికెన్ ధరలు తగ్గాయి. గత కొన్ని రోజులుగా బర్డ్ ఫ్ల్యూ వ్యాప్తి చెందుతోంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై చికెన్ అమ్మకాలపై నిషేధం విధించడంతో చేపల ధరలకు రెక్కలు వచ్చాయి. కిలో రూ.140 నుంచి రూ.160 ఉండగా ప్రస్తుతం రూ.200లకు పైగా అమ్ముతున్నారు. దీంతో ముక్క లేనిదే ముద్ద దిగని మాంసాహార ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ చికెన్‌ను నిషేధించినా ఇంకా పట్టణంలో చికెన్ అమ్మకాలు సాగుతున్నాయి. రెస్టారెంట్లలో కూడా చికెన్‌తో కూడిన కూడిన ఆహార పదార్థాలను యథాతథంగా విక్రయిస్తున్నారు. ఇంకా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం లేదు.

భారీఎత్తున సెల్‌ఫోన్లు రికవరీ

రూ.76.56 లక్షల విలువైన 638 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత




బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీసులు మరో మారు భారీ ఎత్తున సెల్‌ఫోన్లు రికవరీ చేసి పోగొట్టుకున్న వారికి అందించారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మూడు నెలలుగా జిల్లాలో అనేకమంది సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారన్నారు. వీటిని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) ద్వారా రికవరీ చేసి బాధితులకు అందించామని చెప్పారు. మొత్తం రూ.76.56 లక్షల విలువైన 638 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామని ఎస్‌పి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం నూతనంగా వచ్చే సెల్‌ఫోన్లలో ఫైండ్ మై లొకేషన్ యాప్ ద్వారా వాటిని ఆన్‌లో ఉంచుకోవాలని, ఎవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే వాటి లొకేషన్ ఈ యాప్ ద్వారా తెలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, సిసిఎస్ సిఐ రాజశేఖర్, ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

ప్రజా సంఘాల నేతలు పిలుపు



మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - కైకలూరు

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కార్మిక, కర్షక, మహిళ, వివిధ ప్రజా సంఘాలు బలపర్చిన ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నాయకులు కోరారు. కైకలూరులో బుధవారం ఆయా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష్మణరావు ఎంఎల్‌సిగా ప్రజా సమస్యలపై శాసనమండలిలో ప్రజల గొంతు వినిపించడంతోపాటు నిరుద్యోగులు, రైతులు, కార్మికుల సమస్యలపై ప్రత్యక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజల సమస్యలపై పని చేసే లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు నాయకులు జక్కుల మహేష్, కె.లాజరు తదితరులు పాల్గొన్నారు.

కోనేరుపేట యుపిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని కోనేరుపేటలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)ని ఏలూరు జిల్లా ఆరోగ్య పర్యవేక్షక అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించి, మెరుగైన సేవలు వేగవంతంగా అందించేందుకు అనేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిని పరిశీలించినట్లు తెలిపారు. నూటికి నూరు శాతం వేగవంతమైన నాణ్యతతో కూడిన సేవలందించేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కావాల్సిన వసతి సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ, పరికరాల పరిరక్షణ కోసం సెక్యూరిటీ ఏర్పాటు, రాత్రి వేళల్లో అసాంఘిక శక్తుల సంచారంపై వస్తున్న సమాచారంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

దంతాల పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని కుమార్ సిబిఎస్‌ఇ పాఠశాలలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ భాను స్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్య నిపుణులు దేవిశెట్టి దినేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే దంతాల పరిరక్షణపై అవగాహన పెంపొందాలన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రతి వ్యక్తి రెండు పర్యాయాలు దంత పరిశుభ్రత చేయడం ఎంతో అవసరమన్నారు. దంత సంబంధ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. పాఠశాల వ్యవస్థాపకులు పివి.కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం పదిలంగా ఉంటేనే విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నోటి కేన్సర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం ఉన్నా తగు పరీక్షలు చేయించుకోవాలని దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజస్, ప్రిన్సిపల్ స్లీవరాజ్ తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఓరల్, మ్యాక్సిలో ఫేషియల్ సర్జన్స్ డే సందర్భంగా స్థానిక విజయవసర్ సెంటర్‌లోని రిలయన్స్ మార్ట్ వద్ద డెంటల్ కాలేజీ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ నృత్యరూపకాలతో దంత సంరక్షణ, నోటి కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ మోజెస్, స్లీవరాజ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా దేశంలో ఎక్కు వగా నోటి కేన్సర్ వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ధూమ పానం, పొగాకు ఉత్పత్తులు నమలడం వంటివి ఇందు కు ప్రధాన కారణమని తెలిపారు. 70 శాతం పైగా పొగాకు వాడ టం వల్లే కేన్సర్ వస్తుందన్నారు. ఆల్కహాల్ వినియోగం కూడా వీలైనంత వరకు తగ్గించి మంచి ఆహారపు అలవా ట్లతో, మంచి జీవనశైలితో ఉండాలని సూచించారు. హెచ్‌ఒడి డాక్ట ర్ విఆర్.చంద్రబాబు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రమణక్కపేటలో అఖిలభారత ప్రగతి శీల మహిళా సంఘం 32వ వ్యవస్థాపక దినోత్సవం గ్రామ అధ్యక్షురాలు నందిపాము రాణి, కార్యదర్శి ధారా బేబీ శాలిని అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల బక్కయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయాలని, అంగన్వాడీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, సామాజిక భవనం ఏర్పాటు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్‌ను మంజూరు చేయాలని కోరారు.

అర్హులకు పెన్షన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో అర్హత ఉండి పెన్షన్స్ లేని వృద్ధాప్య, వితంతు, వికలాంగ, డప్పు కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి గోలిమే బాలయేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ద్వారకాతిరుమల ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాలయేసు మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు యడ్లపల్లి రమేష్, నల్లంటి మర్రయ్య, భూషణం, ఏపూరి గంగరాజు, నల్లంటి పెద్దిరాజు, జాలాది సత్తెయ్య, ఉండి మర్రయ్య, షేక్ దుర్గాలి పాల్గొన్నారు.

చలువ పందిళ్ల పనులు వేగవంతం

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ శివరాత్రి ఉత్సవాల సందర్భంగా యాత్రికులు సేద తీరడానికి ఇసుక తిన్నెలపై చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు బుధవారం ప్రారంభించినట్లు కాంట్రాక్టర్లు వీరబాబు, ధర్మేంద్ర తెలిపారు. 20 చలువ పందిళ్ళు, 50 వస్త్రాలు మార్చుకునే గదులు, 50 తాత్కాలిక మరుగుదొడ్ల గదుల పనులు ఉత్సవాలనాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దేవరగుంటలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దేవరగుంటకు చెందిన పల్లగాని కృపారావు (45) చెరువులోకి గేదెలను తోలి కొంతసేపటి తర్వాత వాటిని ఒడ్డుకు చేర్చే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. ఇది చూసిన స్థానికులు కృపారావును బయటకు తీసేసరికి మృతి చెందాడు. కృపారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని కొత్తపేట మీసేవ ఎదురుగా ఉన్న సందులో పెన్షన్ మహాల్ మసీదు వద్ద వక్ఫ్‌బోర్డు భూ వివాదంలో ఇరు గ్రూపుల మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో పెన్షన్ మహాల్ మసీదు కమిటీ వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డ్ స్థలాన్ని కొంతమంది కబ్జా చేయాలని ప్రయత్నించడంతో కమిటీ వారితో కలిసి స్థానిక ముస్లిం సోదరులందరూ కలిసి అడ్డుకున్నట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కె.అలీమ్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ ఆదేశానుసారం పెన్షన్ మహాల్ మసీదు వద్ద అక్రమ కట్టడం జరుగుతుందని ఫిర్యాదు రావడంతో దానిపై విచారణకు వచ్చినట్లు తెలిపారు. ఆ స్థలానికి సంబంధించిన పూర్తి ప్లాన్ తమ దగ్గర ఉందన్నారు. తహశీల్దార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మున్సిపల్ కమిషనర్‌కు పూర్తి రిపోర్ట్ ఇచ్చినట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డ్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న సర్వే రిపోర్ట్ ప్రకారం ఈ స్థలం వక్ఫ్‌బోర్డుకు సంబంధించిందన్నారు. మళ్లీ రీ సర్వే నిర్వహించి స్థలంపై పూర్తి రిపోర్ట్ అందిస్తామని తెలిపారు.

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు

జెఇఇ మెయిన్ సెషన్-1 ఫలితాల్లో ఏలూరు ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని సిఇఒ తులసీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో అద్భుత శాతం సాధించిన విద్యార్థుల వివరాలు తెలిపారు. వి.సాయివర్షిత్ 99.10 శాతం, వై.భానుకార్తికేయ 98.50, ఎం.కాశీనాగవిష్ణు 98, పి.సత్యసాహితి 97.53 శాతం, డి.పూర్ణవెంకటశ్రీనివాస్ 94.70 శాతం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అద్భుత ఫలితాల సాధనలో ప్రముఖ పాత్ర వహించిన సీనియర్ అధ్యాపకులను, విద్యార్థులను కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళాశాలల ఛైర్మన్ ఆలపాటి రవీంద్ర ఫోన్ ద్వారా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, పివి.సురేష్, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సిహెచ్.శివకుమార్, కళాశాల ఎఒలు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నూజివీడు టౌన్ ప్రథమ ర్యాంకర్‌గా మధునయ్

నూజివీడు టౌన్ :పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థి అరవ మధునయ్ జెఇఇ మెయిన్స్ పరీక్షల్లో 97.69 శాతం సాధించి టౌన్ ఫస్ట్ ర్యాంకర్‌గా నిలిచినందుకు కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, తోటకూర సాంబశివరావు, మొరంపూడి సత్యనారాయణ అభినందించారు. కళాశాలలో బుధవారం వారు మాట్లాడుతూ నిరంతర శ్రమ సత్ఫలితాలను అందిస్తుందన్నారు. మధునయ్ ఇంటర్ ఫస్టియర్‌లో 470 మార్కులకు 465 మార్కులు సాధించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని కూనవరం మండలానికి చెందిన మధునయ్ చదువు పట్ల శ్రద్ధ కలిగి క్రమశిక్షణ, ప్రణాళికతో ముందడుగు వేయడమే ఇంతటి విజయానికి కారణంగా చెప్పారు. ప్రతిఒక్కరూ మధునయ్‌ను ఆదర్శంగా తీసుకుని చదువుల్లో ప్రగతి సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించి జీవితంలో విజేతలుగా ఎదిగి సుస్థిర స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు.



మధునయ్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

టినక్టి ప్లేజ్‌తో గుండెకు భరోసా

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుత సమాజంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని, గుండెపోటుకు గురైనవారికి గోల్డెన్ అవర్‌లో టినక్టి ప్లేజ్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ బి.పాల్‌సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చినప్పుడు తొలిగంటలో ఈ అత్యవసర ఇంజక్షన్ ఇస్తే రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ఇది కాస్త ఖర్చుతో కూడిన వ్యవహారమని, అయితే రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి గుండె నొప్పి రోగులకు స్వాంతన చేకూరేలా స్టెమి అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తద్వారా రూ.45 వేల విలువైన ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తుందని చెప్పారు. జిల్లాలోని అన్ని సెకండరీ హెల్త్ ప్రభుత్వాసుపత్రుల్లో ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇంటింటా న్యాయసేవలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయ సేవలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 62 బృందాలను ఏర్పాటు చేసినట్లు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, మెడికల్ డిపార్ట్‌మెంట్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, అంగన్వాడీ టీచర్లతో ఈ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సభ్యులు గ్రామ గ్రామాల్లోనూ, ఇంటింటా తిరుగుతూ బాలల సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల సౌకర్యాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. బాల్యవివాహాల బాధితులను గుర్తించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాలకు ఈ టీమ్‌లు వచ్చినప్పుడు ప్రజలు సహకరించి తమ వివరాలను తెలియజేసి ప్రభుత్వం అందించే ఆరోగ్య సంక్షేమ పథకాలను పొందవచ్చని తెలిపారు.

స్త్రీ నిధి లోన్ నగదు బదిలీపై విచారణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలోని ఓ గ్రూపునకు పడాల్సిన స్త్రీ నిధి లోన్ నగదు వేరే వ్యక్తికి బదిలీ కావడంపై ప్రజాశక్తి దినపత్రికలో కథనం వెలువడటంతో అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్త్రీ నిధి మేనేజర్ కె.నవత స్థానిక వెలుగు కార్యాలయానికి వచ్చి లోన్ అమౌంట్ పక్కదారి పట్టడంపై విచారణ చేశారు. ఆన్‌లైన్‌లో జరిగిన చిన్న తప్పిదం వల్ల లోన్ నగదు వేరే వ్యక్తి పర్సనల్ ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై సిబ్బంది సదరు వ్యక్తి దగ్గరకు వెళ్లి అడగగా ఐదు రోజులు గడువు కోరినట్లు చెబుతున్నారు. ఖాతాలో పడిన నగదును వాడుకోవడంపై ఎపిఎం ఝాన్సీ, సిబ్బంది కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

ఏలూరు సిటీ :ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చిందని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి సీనియర్ నాయకులు చల్లా వెంకట సత్యవరప్రసాదరావు స్పష్టం చేశారు. ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉండే ఎంఎల్‌ఎ బడేటి చంటి పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చేసిన సూచన మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బడేటి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో బడేటి చంటి సతీమణి బడేటి మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమానులు, బడేటి కుటుంబ సభ్యుల సత్కారాన్ని ఆత్మీయంగా స్వీకరించిన బడేటి మీనా వారి మధ్యే కేక్‌లు కట్ చేశారు. అనంతరం 8,750 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారులు సేవాకేంద్రాలకు ఉపయుక్తంగా ఉండేలా సమకూర్చిన మూడు వాటర్ డిస్పెన్సరీలను పంపిణీ చేశారు. గాయత్రి అనే ఎంసిఎ విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని స్థానిక ఎంప్లాయిస్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐద్వా పేట కమిటీ ఆధ్వర్యంలో కాలనీ మహిళలు సచివాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో రాత్రుళ్లు గుర్తు తెలీని వ్యక్తులు కేకలు, అరుపులతో స్థానికులను భయపెడుతున్నారన్నారు. బైపాస్ రోడ్డు కాలనీ పక్కన ఉండడంతో భారీ వాహనాలు అనధికారికంగా కాలనీ రోడ్లపై తిరుగుతున్నాయన్నారు. మున్సిపల్ నీరు ప్రతిరోజు రావడంలేదన్నారు. కనీసం మున్సిపల్ వాటర్ ట్యాంక్ కూడా రావడం లేదని చెప్పారు. వీధి కుక్కలు, కోతుల బెడద ఉందన్నారు. డ్రెయినేజీ లేక మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది వాటి కాటుకు గురైన పిల్లలకు జ్వరాలు, రోగాలు వస్తున్నాయన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన సచివాలయ అధికారులు కాలనీలో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నూజివీడు అధ్యక్షురాలు నండూరి పద్మాంజలి, ఐద్వా ఎంప్లాయిస్ కాలనీ పేట కమిటీ నాయకులు ఆకుల పద్మావతి, నీలగిరి శిరీష, ఆకుల అనుష, వై.సంధ్య, జె.శివకుమారి పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న మహిళలు

డ్రైవర్లు విధిగా ఏకాగ్రతతో ఉండాలి

రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపులో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్



డ్రైవర్లను సత్కరిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ఆర్‌టిసి ఏలూరు డిపో గ్యారేజ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు డిపోలో ఉత్తమ డ్రైవర్లకు బహుమతి ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సులో 59 మంది ప్రయాణికులు కాకుండా 59 కుటుంబాలు తమతో ఉన్నాయని డ్రైవర్లు గుర్తించాలని, ప్రతిఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు విధిగా ఏకాగ్రతతో ఉండాలని, ప్రమాదాలకు గురికాకుండా డ్రైవింగ్ చేయాలని వివరించారు. 30 ఏళ్ల పాటు ఏ ప్రమాదం జరగకుండా డ్రైవింగ్ చేసిన డ్రైవర్లను ప్రశంసించారు. జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రోడ్డు భద్రత మసోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్, రక్తదాన శిబిరం, ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ డ్రైవర్లకు ఎస్‌పి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, నూజివీడు డిపో మేనేజర్ పవన్ కుమార్, జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్, మూడు డిపోల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, పిఆర్‌ఒ నరసింహం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఏలూరు స్పోర్ట్స్ :రక్త దానం చేసే ప్రతిఒక్కరూ ప్రాణదానం చేసినట్లేనని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన రవాణా శాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు.

హాస్టల్ పున:ప్రారంభించాలని పూర్వ విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుక్కునూరు మండలంలోని అమరవరం ఉన్నత పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌ను పున:ప్రారంభించాలని పూర్వ విద్యార్థులు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజును కోరారు. ఈ మేరకు జీలుగుమిల్లి మండలంలోని బర్రికలంపాడులో ఉన్న ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఆయనను పూర్వ విద్యార్థులు బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పూర్వం నుంచి అమరవరంలో హాస్టల్ వసతి సౌకర్యం ఉండగా 2014లో ముంపు పేరుతో పిల్లలు తగ్గారని మూసివేశారని చెప్పారు. ఇటీవల కాలంలో అమరవరంలో పునరావాస కాలనీలు ఏర్పాటు చేయడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు తెలిపారు. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల విద్యార్థులకు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ బాలరాజు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పున:ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ బాలరాజును పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేకా ఈశ్వరయ్య, నవ తెలంగాణ రిపోర్టర్ మడిపల్లి వెంకటేశ్వరరావు, హాస్టల్ మాజీ వార్డెన్ శివ భాస్కర్, మార్కు, నాగేశ్వరరావు, వెంకట్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆటో ఛార్జీలు అదనంగా వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

ఆటో ఛార్జీలు అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రంగనాయకులు హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలవరం పంచాయతీ ఆవరణలో ఆటో యూనియన్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని, వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు, ఆటో యూనియన్ నాయకులు వీరన్న, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భూములు స్వాధీనం చేసుకుంటున్నారని ఆందోళన

కాదని చెప్పడంతో విరమణ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని సున్నాలగండి ఏజెన్సీ గ్రామంలో గిరిజనుల పట్టా భూముల్లో అటవీశాఖ సిబ్బంది సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో బుధవారం ఆ గ్రామ గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం రేంజ్ అటవీశాఖ సిబ్బంది సున్నాలగండిలో రెండు ప్రాంతాల్లో అటవీశాఖ రిజర్వు ఫారెస్టు అటవీ భూములకు సరిహద్దు స్తంభాలను ఏర్పాటు చేశారు. అవి చూసిన గిరిజనులు అటవీశాఖ అధికారులు తమ భూముల స్వాధీనం చేసుకుంటున్నారనే భయాందోళనలకు గురై తమ పట్టాదారు పాసు పుస్తకాలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అటవీశాఖ వింజరం డిఆర్‌ఒ బిఎస్.మీనాక్షి మాట్లాడుతూ అటవీక్షేత్రాధికారి ఆదేశాల మేరకు శాటిలైట్ సర్వే కోసం రిజర్వు అటవీ ప్రాంతంలో ఉన్న సున్నాలగండి గ్రామం చుట్టూ ఉన్న రిజర్వు ఆటవీ భూములకు పది ప్రాంతాల్లో సరిహద్దు సూచికల ఏర్పాటు పనులు ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో సూచికల సరిహద్దుల్లో ఉన్న గ్రామస్తులకు చెందిన 35 ఎకరాల పట్టా భూముల సరిహద్దుల్లో సూచికల ఏర్పాటు కోసం కాంక్రీటు స్తంభాలు ఏర్పాటు చేశామని, ఈ విషయంలో సంబంధిత భూముల రైతులు అపోహలకు గురై ఆందోళన చెందారని తెలిపారు. పట్టా భూములు కలిగిన వారి భూముల సరిహద్దుల వద్ద రిజర్వు అటవీస్థలం ఉండడం వల్ల సూచికలు ఏర్పాటు చేశామని, వారి భూములకు, పంటలకు ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. విషయం తెలుసుకున్న గిరిజనులు శాంతించారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు ఎరువులను వాడాలని మండవల్లి ఎడిఎ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని దేవపూడి, చిగురుకోట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటమణి మాట్లాడుతూ తలమాడు తెగులు వ్యాప్తిని అరికట్టడానికి ముందుగా తామర పురుగును నియంత్రించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, ఇరుగ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు,, రైతులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం :మండలంలోని గణపవరం, బుట్టాయగూడెం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సొంత భూమి కలిగిన రైతులు వారి పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ లేదా 1బి, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబర్ లింక్ అయిన ఫోన్ తీసుకుని స్థానిక రైతు సేవా కేంద్ర సహాయకులను సంప్రదించాలని తెలిపారు.

ముసునూరు :మండలంలోని లోపూడి, చింతలవల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయాధికారి కె.సూరిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటలో ఏ విధంగా అధిక దిగుబడి పొందవచ్చో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బం పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని తుక్కులూరు, మోర్సపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్టర్ వల్ల భూమి కలిగిన రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ విశిష్ట సంఖ్య ఆధారంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. రానున్నకాలంలో కౌలు రైతులకు, రైతు కూలీలకు ఈ పద్ధతిని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

పెన్షన్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో 57 వికలాంగ పెన్షన్లు వెరిఫికేషన్ చేస్తున్నట్లు ఎంపిడిఒ మణికుమారి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్రమ పెన్షన్లు గుర్తించి తొలగించే ప్రక్రియలో బాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 57 పెన్షన్లు వెరిఫికేషన్ చేసేందుకు మూడు వైద్య బృందాలుగా కేటాయించినట్లు తెలిపారు.. వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు.

కౌలు రైతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కౌలు రైతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి మూలధనం కౌలు రైతుల నుంచి ఒక శాతం, ప్రభుత్వం నుంచి నాలుగు శాతం కలిపి ఈ మొత్తాన్ని బ్యాంకులకు చూపించాలని, ఆ బ్యాంకు నుంచి కార్పొరేషన్ అప్పు తీసుకుని కౌలు రైతుల కార్పొరేషన్ నుంచి రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌలు రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ మాట్లాడుతూ కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద తక్షణమే రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలన్నారు.

ఘనంగా బాలరావమ్మ తిరునాళ్లు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాల్లో శ్రీ దుగ్గిరాల బాలరావమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా తోటపల్లిలోని శ్రీ దుగ్గిరాల బాలరావమ్మకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పట్టు వస్త్రాలను అనంతరం జరిగిన భారీ అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కనసానపల్లి, ఆగిరిపల్లిలో నిర్వహించిన శ్రీ బాల రావమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాల్లో కూడా మంత్రి పాల్గొన్నారు. తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి సర్పంచి చవటపల్లి లక్ష్మీవిక్టర్‌బాబు, కనసానపల్లి సర్పంచి అమ్మిశెట్టి రమణ సంజీవరావు, తోటపల్లి సర్పంచి ఆరేపల్లి శ్రీపద్మ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆగిరిపల్లి ఎస్‌ఐ కె.శుభశేఖర్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఆగిరిపల్లి మండల విశ్వ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

చికెన్ విక్రయాలు నిలిపివేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో చికెన్, కోడిగుడ్ల విక్రయాలను అధికారులు వెంటనే నిలిపివేయాలని పలువురు గ్రామ సర్పంచులు మండల స్థాయి అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావంతో ఉభయ గోదావరి జిల్లాల్లో వేలాదిగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న పిల్లలకు గుడ్లు ఇవ్వడం వల్ల అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. కొన్ని రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో చికెన్, కోడిగుడ్ల విక్రయాలను నిలిపివేయాలన్నారు. తహశీల్దార్ సుభానికి దృష్టికి వెళ్లి మండల వ్యాప్తంగా చికెన్, గుడ్ల విక్రయాలను నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు.

'రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజలకు సంక్షేమ ఫలాలు సమైక్యంగా అందిద్దామని, ఎంఎల్‌సిగా రాజశేఖరం గెలుపునకు కలిసికట్టుగా పని చేద్దామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య నేతృత్వంలో జంగారెడ్డిగూడెం, కామవరపుకోట జనసేన కేడర్‌తో ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాజశేఖరం గెలుపునకు కేడర్లకు అతీతంగా కష్టించి పని చేయాలని సూచించారు. టిడిపి కేడర్‌తో పాటు జనసేన కార్యకర్తలకు కూడా తగిన ప్రాధాన్యత కల్పించాలని పలువురు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

ద్వారకాతిరుమల : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని ఎన్నికల పరిశీలకులు దులి రంగనాయకులు కోరారు. ఈ మేరకు ద్వారకాతిరుమలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఎన్నికల మండల కో-ఆర్డినేటర్ పోలిన శ్రీనివాస్, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.